ధారూరు : దోర్నాల్-ధారూరు స్టేషన్ మధ్య ఉన్న కాగ్నానది వాగు వంతెనపై పొంగుతున్న వర్షపు నీరు

తాండూరు రూరల్ : ఉధృతంగా ప్రవహిస్తున్న బెల్కటూర్ వాగు

# పొంగిన వాగులు, వంకలు

- వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం
- దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు..
- రాకపోకలకు అంతరాయం
- నిలిచిపోయిన ప్రయాణాలు

ధారూరు, ఆగస్టు 31 : మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి దోర్నాల్-ధారూరు స్టేషన్ (కాగ్నా)వాగు పొంగి పొర్లుతున్నది. శనివారం ఉదయం కాగ్నావాగు తాత్కాలిక వంతెన దెబ్బతిన్నది. దీంతో దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, నాగారం, కుమ్మరిపల్లి, దోర్నాల్‌తండాతోపాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముందస్తు చర్యగా ధారూరు పోలీసులు అక్కడ రాకపోకలను నిలిపేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కురుస్తున్న వానకు పంట పొలాలు నీటితో నిండిపోయాయి.

### నిండిన గండి చెరువు

కులకచర్ల : భారీ వర్షాలకు కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని చెరువుల్లోకి నీరు చేరింది. కులకచర్ల మండల పరిధిలోని గండి చెరువు నిండి అలుగు పారుతున్నది. రాంనగర్ గ్రామం దగ్గర రోడ్డు పై నుంచి వాగు పారు తుండడంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షానికి మరికల్ చెరువు నిండి అలుగు పోస్తున్నది.

చౌడాపూర్ : అలుగు పారుతున్న గండి చెరువు

పరిగి : వాగులో పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

### భారీ వర్షం నిలిచిన రాకపోకలు

పరిగి : పరిగి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన వాన శనివారం ఉదయం వరకు కురియడంతో పలు గ్రామాల్లోని వాగులు వరద నీటితో ప్రవహించాయి. పలు చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. లఖ్నాపూర్ ప్రాజెక్టులోకి 25 శాతం వరకు నీరు వచ్చింది. ఈ ప్రాజెక్టు నీటి మట్టం 18 అడుగులు కాగా శనివారం సాయంత్రం వరకు 25 శాతం వరకు నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇదిలావుండగా భారీ వర్షంతో పరిగి పట్టణ శివారులోని వాగు పొంగి కాజ్‌వే పై నుంచి ప్రవహించడంతో పరిగి-వికారాబాద్ మధ్య కొంతసేపు వాహనాల రాకపో కలు నిలిచిపోయాయి. కాజ్‌వే కింద చెత్త చేరడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి ఆ చెత్తను జేసీబీ సహాయంతో తీయించారు. అప్పుడు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న మైసమ్మతండా వాగు

### కొడంగల్‌లో 42.2 ఎంఎంల వాన

కొడంగల్ : కొడంగల్‌లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు ఇదే పెద్ద వాన అని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి కురిసిన 42.2 ఎంఎంల వానతో చెరువులు, వాగుల్లోకి నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇటువంటి వర్షాలు మరో 4, 5 రోజుల పాటు కురిస్తే చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకుంటుందని రైతులు పేర్కొంటున్నారు. చెరువులు, కాల్వల నుంచి నీరు పారుతుండటంతో కొందరు వలలు వేసి చేపలను పట్టేందుకు గుమిగూడారు.

కొడంగల్ చెరువులో నీటి ప్రవాహం

### ఉధృతంగా ప్రవహిస్తున్న బెల్కటూర్ వాగు

తాండూరు రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాండూరు మండలంలోని బెల్కటూర్‌వాగుతో పాటు నారాయణపూర్ కాగ్నావాగు, అల్లాపూర్, ఐనెల్లి వాగులు పొంగిపొర్లాయి. దాంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గౌతాపూర్ - కరణ్‌కోట మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి.

### బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

మండలంలోని బుచన్‌పల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన జాజిగుబ్బడితండాకు చెందిన కరంతోడు శ్రీనివాస్ కుమారుడు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. కాగా శనివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ రూ.85 వేల ఎల్‌వోసీని బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్, రాములు యాదవ్, ప్రభాకర్ పాల్గొన్నారు. -మర్పల్లి, ఆగస్టు 31

### వరుణ దేవుడికి వరద పాశం

మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో పాండవుల బండపై గ్రామస్తులు సామూహికంగా వరుణదేవుడికి శనివారం వరద పాశం పోశారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. ప్రతి ఏటా పాండవుల బండపై వరుణదేవుడికి వరద పాశం పోస్తామని గ్రామస్తులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు. - కులకచర్ల, ఆగస్టు 31

### సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించాలి

మన సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన తీజ్ ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, గండీడ్ మాజీ ఎంపీపీ శాంతి, లాల్‌కృష్ణప్రసాద్, కృష్ణ, పరశురాంరెడ్డి, హన్మంతు, అక్బర్‌హుస్సేన్ పాల్గొన్నారు. -పరిగి, ఆగస్టు 31

## పేదలకు వరం..సీఎంఆర్ఎఫ్

తాండూరు : లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 31 : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని 39 మంది లబ్ధిదారులకు రూ. 16 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులున్నారు.

#### బషీరాబాద్‌లో..

బషీరాబాద్ : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ దవాఖానల్లో చికిత్స పొందిన 39 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదలకు పెద్దపీట వేశామ న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నర్సింహులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు మాధవ్‌రెడ్డి, చందర్‌నాయక్, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మునీర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాణిక్‌రెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్‌ను సరిచేయను..

## ఎవరికీ చెప్పకొంటారో.. చెప్పకోండి

### నెల్లిగడ్డతండావాసులకు స్థానిక లైన్‌మన్ నిర్లక్ష్యపు సమాధానం

పత్తి చేనులో తెగిపడ్డ విద్యుత్తు వైరు

పెద్దేముల్, ఆగస్టు 31 : తమ గ్రామంలో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని కోరితే లైన్‌మన్ పట్టించుకోవడంలేదని.. ఎవరికీ చెప్పకొంటారో చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని నెల్లగడ్డతండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండాపూర్ అనుబంధ గ్రామమైన నెల్లిగడ్డతండాలో గత ఐదు రోజుల కిందట బోర్‌మోటర్‌కు సంబంధించిన విద్యుత్తు వైరు తెగి పత్తి పొలంలో పడిపోయింది. దానితో ప్రమాదం పొంచి ఉందని దానిని త్వరగా సరి చేయాలని తండాకు చెందిన పలువురు యువకులు స్థానిక విద్యుత్తు లైన్‌మన్ రాజేశ్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అతడిపై చర్యలు తీసుకోవడంతోపాటు తెగిపడిపోయిన విద్యుత్తు వైరును వెంటనే సరిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### పరిగి ఇన్‌చార్జి ఎంపీడీవోగా విజయకుమార్

పరిగి, ఆగస్టు 31 : పరిగి మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో విజయకుమార్ శనివారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగవిరమణ చేయడంతో ఎంపీవోకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను అధికారులు అప్పగించారు.

### మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బంట్వారం, ఆగస్టు 31 : తండ్రి మందలించాడని ఓ బాలిక మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన బంట్వారం ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తొర్మామిడి గ్రామానికి చెందిన ఓ బాలిక తండ్రి మందలించాడని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తాం దూరు జిల్లా దవాఖానకు 108లో తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని..తల్లిదండ్రులు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

### 8 మొబైల్‌ఫోన్ల రికవరీ

పరిగి, ఆగస్టు 31: ఇటీవల పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పరిగి పోలీసులు సీఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి శనివారం పరిగి ప్రాంతానికి చెందిన బాధితులు సయ్యద్ అలీం, మహేశ్, మహేందర్, ప్రసాద్, బాల్‌రాజ్, రంజిత్, భగవంత్‌రెడ్డి, యాదయ్యలకు అందజేశారు.

### బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి

బంట్వారం, ఆగస్టు 31 : విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని బస్వాపూర్ గ్రామానికి ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని శనివారం డిపో మేనేజర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

### లైన్‌మన్‌కు బదిలీతోపాటు ప్రమోషన్

వికారాబాద్, ఆగస్టు 31 : క్రమశిక్షణతో పనిచేసిన వారికి పదోన్నతులు రావడం సంతోషకరమని వికారాబాద్ డీఈ సంజీవి, ఏడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మోమిన్‌పేట మండల విద్యుత్తు శాఖలో లైన్‌మన్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ ధారూరు మండలానికి బదిలీ కావడంతోపాటు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందడంతో మోమిన్‌పేట మండల విద్యుత్తు కార్యాలయంలో ఆయన్ను వారు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఈ వినోద్‌కుమార్, సిబ్బంది శర్ఫొద్దీన్, ప్రసాద్, స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనది

కులకచర్ల, ఆగస్టు 31 : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని కులకచర్ల ఎంఈవో హబీబ్‌అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని పుట్టపహాడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసయ్య ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నేటి నుంచి రామలింగేశ్వరుడి జాతర

బషీరాబాద్, ఆగస్టు 31 : నేటి నుంచి మూడు రోజులపాటు వికారాబాద్ జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన ఏకాంబరి రామలింగేశ్వరుడి ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ప్రతిఏటా శ్రావణ మాస చివరి సోమవారం నుంచి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. 1న నీళ్లపల్లి గ్రామం నుంచి ఆలయం వరకు పల్లకీసేవ, స్వామివారికి ప్రత్యేక అలంకరణతో కూడిన పూజలు, అభిషేకం, రథోత్సవం, ఉత్సవాలు, 2న రథోత్సవ ం, 3న జాతర ముగింపు ఉత్సవాలు ఉంటాయి. కాగా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. ఉదయం నుంచి రాత్రి వరకు తాండూరు, నారాయణపేట, సేడం, పరిగి, మహబూబ్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

#### జాతర ఏర్పాట్లను పరిశీలన

నేటి నుంచి జరిగే ఏకాంబరి రామలింగేశ్వరుడి జాతర ఉత్సవాల ఏర్పాట్లను ఎంపీడీవో యాదయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, శానిటేషన్ పనులపై ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డితో చర్చించారు.

### కల్లు దుకాణంలో రూ.లక్ష చోరీ

సీసీ పుటేజీలో నమోదైన దృశ్యం

పెద్దేముల్, ఆగస్టు 31 : మూసి ఉన్న కల్లు దుకాణంలో దొంగలు దూరి రూ.లక్ష నగదును తస్కరించారు. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కలాల్ రమేశ్‌గౌడ్ (చిన్నా) మండల కేంద్రంలో కల్లు దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అతడు రాత్రి 8 గంటల వరకు దుకాణాన్ని నడిపించి అనంతరం తన తండ్రికి అప్పగించి వెళ్లిపోయాడు. అయితే ఉదయం సమయంలో అతడు టమాట బాక్సుల కింద రూ.లక్ష దాచిపెట్టాడు. కాగా అతడి నాన్న రాత్రి 8.30 షాపును మూసేసి ఇంటికెళ్లాడు. శనివారం ఉదయం అతడి తండ్రి షాపును తెరిచి చూడగా కల్లు పెట్టెలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ విషయాన్ని అతడు రమేశ్‌గౌడ్‌కు ఫోన్ చేసి చెప్పగా.. అతడు షాపునకు వచ్చి.. టమాటా బాక్సుల కింద దాచిన రూ.లక్ష నగదును చూడగా లేకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలను పరిశీలించగా.. శుక్రవారం రాత్రి 9:46 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి.. ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై ఉండగా.. ఒకరు షాపులోకి వెళ్లినట్లు అందులో స్పష్టంగా కనిపించింది. వారూ చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడి అనుమానాస్పద మృతి

పెద్దేముల్ : సుద్ద గుంతలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెద్దేముల్ ఎస్ఐ గిరి కథనం ప్రకారం..రుద్రారం గ్రామానికి చెందిన బండమీది నాగమ్మ, లక్ష్మప్ప దంపతులకు ముగ్గురు సంతానం . అందులో రెండోవాడు రమేశ్(27) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఎర్ర వెంకటప్పతో కలిసి చికిత్స కోసం పెద్దేముల్ ప్రభుత్వ దవాఖానకెళ్లాడు. అయితే సాయంత్రం సమయంలో వెంకటప్ప తిరిగి గ్రామానికి వచ్చాడు. తన కొడుకు ఇంటికి రాకపోవడంతో నాగమ్మ వెంకటప్పను రమేశ్ ఎక్కడ అని అడిగితే బుద్ధారంలోని తన అక్క వద్దకు వెళ్లానని చెప్పాడన్నాడు. శనివారం ఉదయం నాగమ్మకు గోపాల్‌పూర్ గ్రామస్తులు మీ కుమారుడు రమేశ్ మా గ్రామ శివారులోని దర్మి చెట్టు పక్కన ఉన్న ఓ సుద్ద గుంతలో మృతి చెంది ఉన్నాడని చెప్పారు. నాగమ్మ అక్కడికెళ్లి చూసి.. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

## రేపటి నుంచి రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు

కులకచర్ల, ఆగస్టు 31 : బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సుధాకర్, చైర్మన్ నర్సమ్మారాములు తెలిపారు. శనివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి వారు బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం రామలింగేశ్వర స్వామికి అభిషేకం, సాయంత్రం శకటోత్సవం, మంగళవారం స్వామి సర్వదర్శనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాండుశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శని త్రయోదశి

వికారాబాద్, ఆగస్టు 31 : శని త్రయోదశిని పురస్కరించుకుని మోమిన్‌పేట మండలంలోని ఎన్కతల గ్రామం లో వెలసిన శ్రీశనైశ్వరుడికి భక్తులు శనివారం ఉదయం నుంచే తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనేశ్వరుడికి ఇష్టమైన నల్లని గుడ్డ, నల్లని నువ్వులు, నల్లని నూనె, నెయ్యితో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పూజారులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దోమ: శ్రావణమాస చివరి శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యే క పూజలు నిర్వహించారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలో స్థానికులు హనుమాన్‌కు అభిషేకం, సింధూర పూజ చేశారు. కార్యక్రమంలో పూజారి కన్నయ్య, యువకులు నరేశ్, రవికుమార్, శంకర్, లక్ష్మణ్, ధర్మ, శ్రీను, బాల్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పూడూరు, ఆగస్టు 31 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భరత్, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిలు వేర్వేరుగా ప్రకటనల్లో పేర్కొన్నారు. రానున్న రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పిన నేపథ్యంలో.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతేనే ఇండ్ల నుంచి బయటికి రావాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లల్లో ఉండొద్దన్నారు. చెరువులు, వాగులు నీటి ప్రవాహంతో ప్రమాదకరంగా ఉంటే సమాచారం ఇచ్చేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ 97046 31328కు, పోలీస్ అధికారి నంబర్ 87126 70042 ఫోన్ చేయాలన్నారు.

### శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండొద్దు..

మర్పల్లి : రానున్న 48 గంటలు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ఎస్ఐ సురేశ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండొద్దని.. పిడుగులు పడే అవకాశం ఉన్నందున కరెంటు స్తంభా లు, చెట్ల కింద ఉండొద్దన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం 24 గంటలు మర్పల్లి పోలీసులు అందుబాటులో ఉంటారని, అలాగే 100కు, కానీ 8712670038 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమతంగా ఉండాలి

### ధారూరులో..

ధారూరు : ప్రజలు అప్రమతంగా ఉండాలని ధారూరు సీఐ రామకృష్ణ సూచించారు. ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఎవరైనా ప్రమాదాల్లో చిక్కుకుంటే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

### రోడ్డు డివైడర్‌లో మొక్కలు నాటాలి

వికారాబాద్: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రోడ్డు డివైడర్‌లో ఫాక్స్‌టైల్, డ్రాకేనా మొక్కలు నాటాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులార మేశ్ సూచించారు. శనివారం ఆమె ఎన్టీఆర్ చౌరస్తా ప్రధాన కూడలి నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, యేసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎంపీడీవోకు సన్మానం

ఉద్యోగవిరమణ చేసిన పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డిని శనివారం పలువురు ఘనంగా సన్మానించారు. పరిగిలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి దంపతులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, పరిగి మాజీ ఎంపీపీ అరవింద రావు, యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ శ్రీశైలం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు. -పరిగి, ఆగస్టు 31

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★ కలింగనగర్ హైవే ఫేస్ ఫేసింగికి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218

KIDNY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT- 332617

ADMISSIONS
★ Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874.
NT-333107-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.